

ట్రాఫిక్ నియంత్రణ చర్యలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతానికి వచ్చే పర్యాటకులు వాహనాల పార్కింగ్‌లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రతిష్టమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్సై కేపీ నాయుడు జలపాతం సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలకు తీసుకోవలసిన చర్యలపై పలు సలహాలు, సూచనలు చేశారు. పార్కింగ్ వద్ద అంతరాయం ఏర్పడకుండా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటకుల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చాపరాయి సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఐ

ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి

ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సుభద్ర



మాట్లాడుతున్న సుభద్ర

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్:ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని, పంచాయితీలలో రెవెన్యూని పెంచే యోచన చేయాలని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆదేశించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో 1 నుండి 7 వరకు స్థాయి సంఘ సమావేశాలు జరిగాయి. అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని పంచాయితీ రాజ్ అధికారులు పనితీరుపై జెడ్పిటిసి సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేసారు. పంచాయితీలలో రెవెన్యూని పెంచే యోచన చేయాలని అధికారులను కోరారు. వికలాంగుల పింఛన్లు రి వెరిఫికేషన్ చేసినప్పటికీ ఎవరి పింఛన్లు రద్దు చేయవద్దని సభ్యులు కోరారు. మునగపాక జెడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ, అనకాపల్లి ఆర్ఇసిఎస్‌లో ప్రమోషన్లలో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ సంస్థలో అర్హత లేని, సర్టిఫికెట్స్ లేని వ్యక్తులు తప్పుడు సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్న వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. తప్పుడు ప్రమోషన్ల ఆధారంగా తీసుకున్న జీతాలను రికవరీ చేయాలని కోరారు. గ్రామపంచాయతీ పరిధిలో అక్రమ లే అవుట్‌లతో పంచాయతీ ఆదాయం కోల్పోతుందని, ప్లాట్లు కొనుగోలుదారులు నసపోతున్నారని చెప్పారు. అనుమతులు లేని లేఔట్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ, పూర్తి స్థాయి క్యాన్సర్ ట్రీట్మెంట్, గుండెకు సంబంధించిన ఆపరేషన్లు కెజిహెచ్‌లో జరుగుతున్నాయని, వెంటిలేటర్లు కూడా అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు.ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ పథకం కింద కొన్ని ఆసుపత్రులలో 3 వేలకు పైగా ప్రొసీజర్లను చేయించు కోవచ్చని, సభ్యులకు వాటి జాబితా పంపిస్తామని తెలిపారు.



ఆశ్రమ పాఠశాలల్లో సక్రమంగా భోజనం పెట్టలేదు

-అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు

అనంతగిరి జెడ్పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతమైన అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆశ్రమ పాఠశాలలో పిల్లలకు భోజనం సరిగా పెట్టడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో టీచర్ల కొరత ఉన్నదని, వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పూర్తి స్థాయిలో నియమిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, ప్రభుత్వ వసతి గృహాలలో పాఠశాల ఓపెన్లో 25 శాతం సీట్లు ఉంటాయని, ప్రజలు వాటిని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మూడు జిల్లాల అధికారులు, జడ్పిటిసి సభ్యులు, ఎంపిపిలు, జిల్లా పరిషత్ విశాఖపట్నం ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఏలేశ్వరం, జె.అన్నవరం రోడ్డు సమస్యపై

రేపు 'చలో గొంటివానిపాలెం'

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు
- ఆందోళన జయప్రదానికి గిరిజన గ్రామాల్లో సిపిఎం విస్తృత ప్రచారం



గిరిజన మహిళలతో మాట్లాడుతున్న లోతా రామారావు

ప్రజాశక్తి-అడ్డతీగల : ఏలేశ్వరం నుండి గొంటివానిపాలెం, జె అన్నవరం వరకు రహదారి నిర్మాణ సమస్య పరిష్కారానికి ఈనెల 12న చలో గుంటువానిపాలెం ఆందోళనకు ప్రజానీకం కదలి రావాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు బుధవారం పిలుపునిచ్చారు. రహదారి సమస్య పరిష్కారానికి ఈ నెల 12న లక్ష్మీపురం జంక్షన్‌లో రాస్తారోకో ఆందోళన చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ రహదారిపై ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్న వాహనదారులు ప్రయాణికులు, వర్తక సంఘం, విద్యార్థులు ప్రజా ప్రతినిదులు, ప్రజా సంఘాలు, ఆదివాసీ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.కార్యక్రమంలో జర్త రాజు, కొర్రబు సత్యనారాయణ, రెడ్డి బుచ్చమ్మ, కొర్రబు రాజు, ఆయా గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

12న రహదారి సమస్యపై ఆందోళన

రాజవొమ్మంగి:ఏలేశ్వరం నుంచి గొంటివానిపాలెం, జె అన్నవరం వరకు రహదారి సమస్య పరిష్కారానికి ఈ నెల 12న వంటావార్పు ఆందోళన చేపట్టనున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి కొండ్ల సూరిబాబు అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి, రహదారి సమస్యపై ప్రజలకు వివరించి, ఆందోళనలో పాల్గొవాలని పిలునిచ్చారు. కార్యక్రమంలో మల్లమ్మ, కృష్ణ, రామకష్ణ, దుర్గాభవాని, సత్తిబాబు, బొజ్జమ్మ, చినతల్లి, పార్వతి, రామలక్ష్మి, వెంకటరమణ, జె శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సూరిబాబు

పెంచిన రూ.లక్ష పిఎం జన్‌మన్ బిల్లులు చెల్లించాలని

లబ్ధిదారుల నిరసన

ప్రజాశక్తి-అరకులోయరూరల్:పీఎం జన్‌మన్ ఇల్లు నిర్మాణానికి పెంచిన రూ లక్షలను లబ్ధిదారుల ఖాతాలో జమ చేయాలని సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు డిమాండ్ చేశారు. అరకులోయ మండలం సుంకరమెట్ట పంచాయితీ గంగాగుడి గ్రామంలో బుధవారం పర్యటించి లబ్ధిదారులతో నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు మాట్లాడుతూ, పీఎం జన్ మన్ ఇల్లు నిర్మాణానికి అరకొర నిధుల బిల్లులతో పూర్తి కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం జన్ మన్ కింద పివిటీజి కుటుంబాలకు మంజూరు చేసిన జన్ మాన్ ఇళ్లలకు పెంచిన లక్ష రూపాయలు బిల్లులు లబ్ధిదారుల ఖాతాలో జమ చేయాలన్నారు.బిల్లులు జమ కాక పోవడంతో స్లాబ్ లెవెల్ పూర్తి కాక మొండి గోడలకే పరిమితం అయ్యాయని పేర్కొన్నారు. లబ్ధిదారుల చేతిలో డబ్బులు లేక అప్పులు తీసుకునే స్తామత లేక సతమతం అవుతున్నారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి స్లాబ్ లెవెల్ వరకు నిర్మించుకొన్న లబ్ధిదారులకు పెంచిన లక్ష రూపాయలు బిల్లులు చెల్లించి, ఇళ్ల నిర్మాణానికి సహకరించాలని డిమాండ్ చేశారు.



నినాదాలు చేస్తున్న లబ్ధిదారులు

బెర్రీ బోరర్‌తో నష్టపోయిన

కాఫీ రైతులకు ఎకరానికి రూ.లక్ష ఇవ్వాలి

-కిలో పచ్చి కాయలకు రూ.200 చెల్లించాలి

-ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:బెర్రీ బోరర్ కీటక తెగులుతో నష్టపోయిన కాఫీ రైతులకు ఎకరానికి రూ లక్షలు ఇవ్వాలని, కిలో పచ్చి కాయలకు రూ 200 నష్టపరిహారం చెల్లించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. అరకులోయ మండలం చినలబుడు పంచాయతీ పకనకుడి గ్రామంలో బుధవారం పర్యటించారు. బెర్రీ బోరర్ కీటక తెగులతో నష్టపోయిన రైతులతో మాట్లాడుతూ, జరిగిన నష్టంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ,కాఫీ సాగు చేస్తున్న రైతులకు బెర్రీ బోరర్ కీటక తెగులుతో తీవ్ర నష్టం జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నివారణ చర్యలతో పాటు తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఇది అత్యంత హానికర కీటకమని, కాఫీ కాయల్ని లేత దశలో విత్తనానికి రంధ్రం చేస్తూ లోపల గుడ్లు పెడుతూ పంటను సర్వనాశనం చేస్తుందన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో మరింత వ్యాప్తి చెందకుండా నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నివారణ చర్యలతో పాటు ఆదివాసీ కాఫీ రైతులకు ఎకరానికి లక్ష రూపాయలు నష్టపరిహారం, కిలో పచ్చికాఫీ కాయలకు రూ 200 చొప్పున చెల్లించాలన్నారు. బెర్రీ బొరర్ నివారణకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో టాటా, నాంది, టెక్నో, మాక్స్, కాఫీ హౌస్ తదితర ప్రవేట్ కార్పొరేట్ సంస్థలు ఆదివాసీ రైతులు పండిస్తున్న ఆర్గానిక్ కాఫీని కోట్లాది రూపాయలు వ్యాపారం చేసుకోవడానికి పోటీపడి గ్రామాలకు వెళ్తారని, కాఫీ పంట పండించే రైతు భయందోళనతో తీవ్ర స్థాయిలో నష్టపోతుంటే ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేట్ సంస్థలతో చేసుకున్న అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2016 -17 లో ఐటీడీఏ కాఫీ బోర్డుతో పాటు కొన్ని ప్రవేట్ సంస్థలు కాఫీ మొక్కలు పంపిణీ చేశారని, అప్పటి నుండి వేసిన మొక్కలపై సమగ్ర అధ్యయనం చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కిల్లో మొద్దు, ముసిరి మల్లన్న, రాజు, కాఫీ రైతులు, ఒనాది, ప్రతాప్, దొన్ను, డొంబు, అర్జున్, సింహాద్రి, కృష్ణ, గురుమూర్తి, చంద్రయ్య, భగత్ రామ్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలదేవ్

కాఫీ రైతుల సమస్యలపై గ్రామసభ


ప్రజాశక్తి-చింతపల్లి : కాఫీ పంటలో విస్తరిస్తున్న బెర్రీ బోరర్ తెగులు నివారణ చర్యలపై శనివారం గ్రామ పంచాయతీ సర్పంచ్ అంజలి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. తెగులు నియంత్రణ పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అధికారులు వివరించారు. ప్రభుత్వం అందించే పంట సంరక్షణ పథకాలను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎస్.వెంగళరావు, ఉప సర్పంచ్ కె.ఉత్తరకుమారి, పంచాయతీ కార్యదర్శి శివ, బీఓడీ పి.పోతురాజు, ఎఫ్‌సీ బాలకృష్ణ, సిఎల్‌డబ్ల్యు గిరిప్రసాద్, పీసా అధ్యక్షులు రామస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్

అంగన్వాడీల జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పాడేరు:ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అల్లూరి జిల్లా కమిటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం పాడేరులో ఎన్నుకున్నారు. డి.నాగమ్మ అధ్యక్షులుగా, కే.భాగ్యలక్ష్మి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా చిన్నారి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కళావతి, సహాయ కార్యదర్శి గా కే.కొండమ్మ, సహాయ కార్యదర్శిగా కే సత్యవతి, సహా కార్యదర్శి మోదకొండమ్మ, ఉపాధ్యక్షులుగా ఎస్.ఈశ్వరమ్మ, వసంత, డి.నిర్మల, కే.అమ్మాజీ, ఇందుమతి, . వి.సుమిత్ర, ఉపాధ్యక్షులుగా మోదకొండమ్మ మరో 11 మంది జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా యూనియన్ రాష్ట్ర నాయకులు పద్మ, శోభ హాజరయ్యారు.



నాగమ్మ, భాగ్యలక్ష్మి

సిజేరియన్ విజయవంతం

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో సుమారు ఏడాదిన్నర తరువాత నిర్వహించిన సిజేరియన్ శస్త్ర చికిత్స విజయవంతమైంది. బైలికించంగి గ్రామానికి చెందిన కుడుముల ఝాన్సీరాణికి రెండో ప్రసవం సందర్భంగా సాధారణ కాన్పు కష్టమైంది. దీంతో డాక్టర్ వాసవి, డాక్టర్ శ్రీలత (స్త్రీల వైద్య నిపుణులు), డాక్టర్ సాహితి (మత్తు వైద్య నిపుణులు) వైద్య బృందం వైద్య సిబ్బంది సమన్వయంతో సిజేరియన్ శస్త్ర చికిత్స విజయవంతంగా చేశారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి మాట్లాడుతూ ఇకపై చెవి, ముక్కు, గొంతు శస్త్ర చికిత్సలు, ఆర్థోపెడిక్ సర్జరీలు కూడా స్థానికంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బిడ్డను చూపుతున్న వైద్యులు

విష జ్వరంతో మహిళ మృతి





మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు, ఇన్‌సెట్‌లో మృతురాలు జగజ్జనని (ఫైల్)

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయి లాగరాయి గ్రామానికి చెందిన కొంత జగజ్జనని (30) బుధవారం అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం కాకినాడ జిజిహెచ్‌లో మృతి చెందింది. జ్వరం కీళ్లనొప్పులు, వాపులతో బాధపడుతూ లాగరాయి పిహెచ్‌సిలో వైద్యంతో తగ్గకపోవడంతో ఏలేశ్వరం ప్రైవేట్ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. అక్కడ వైద్యసేవలు పొందినా నయం కాకపోవడంతో కాకినాడ జిజెహెక్‌కు తరలించగా, చికిత్స పొందుతూ ఆరోగ్య విషమించి మృత్యువాత పడిందని కుటుంబీకులు తెలిపారు. దీనిపై లాగరాయి వైద్య సిబ్బందిని అడగ్గా, పిహెచ్‌సిలో చికిత్స అనంతరం వైద్యపరీక్షలకు మళ్లీ రావాలని సూచించగా, రాలేదన్నారు. కాగా జగజ్జనని మృతికి వైద్యులే బాధ్యత వహించాలని లాగరాయి సర్పంచ్ మిరియాల గణలక్ష్మి అన్నారు. సకాలంలో సరైన వైద్యసేవలు అందకపోవడం, అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యమే జగజ్జనని మృతికి కారణమని ఆరోపించారు.

జ్వర మరణం బాధాకరం

- రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి:మండలంలోని లాగరాయి గ్రామంలో జ్వరంతో కొంతం జగజ్జనని (30)అనే మహిళ మృతి చెందడం బాధాకరమని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. బుధవారం తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయ భాస్కర్‌తో కలిసి, లాగరాయి గ్రామాన్ని సందర్శించారు. మహిళ మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలి ఐదేళ్ల కుమారుడు సూర్యదీక్షిత్ దుస్థితిని చూసి చలించిపోయారు. బాబును పదోతరగతి వరకు చదివించి, అతని బాగోగులు చూస్తానని భరోసానిచ్చారు. అంత్యక్రియల ఖర్చులకు బాధిత కుటుంబానికి రూ.పదివేలు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీషాదేవి మాట్లాడుతూ, రెండు నెలల క్రితం జగజ్జననికి జ్వరం వచ్చి తగ్గిపోయిందని, మరలా గతనెల 30న జ్వరం రావడంతో స్థానిక ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నా నయం కాకపోవడంతో కాకినాడ జిజిహెచ్‌కు తరలించగా, అక్కడ మృత్యువాత పడిందన్నారు.

వైద్యశిబిరాలను నిర్వహించండి

లాగరాయి, కింద్ర, లబ్బర్తి తదితర గ్రామాల్లోప్రజలు జ్వరాలు,కీళ్ళ నొప్పులతో బాధపడుతున్నారని, ఆయా గ్రామాల్లో వైద్యశిబిరాలను నిర్వహించాలని .ఆరోగ్య శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బందికి సూచించారు. రక్త పరీక్ష నమోనాలు సేకరించి పరీక్షించాలన్నారు. రెండు రోజుల్లో వైద్య నిపుణుల బృందం పర్యటించి, పరిస్థితిపై సమీక్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పారిశుధ్యం, తాగునీటి క్లోరినేషన్, దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.ఎంపిడిఒ యాదగిరేశ్వరరావు, తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎస్ఐ నరసింహమూర్తి. టిడిపి నాయకులు గణజాల తాతారావ్, జనసేన పార్టీ అధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు,ఎఎంసి కమిటీ డైరెక్టర్ కేసిరెడ్డి శివ,టీడీపీ నాయకులు వాసంశెట్టి గంగాధర్,జీరెడ్డి వెంకటరమణ, గొర్లె సీతాంబరం, సూరిశెట్టి సురేష్,జడ్డంగి పార్టీ అధ్యక్షుడు కంఠపురెడ్డి వీరబాబు,గంటి మల్ల శ్రీను,శెట్టి సుబ్బారావు వానపల్లి చిట్టిబాబుఉన్నారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- జికె.వీధి : బహుళ ప్రయోజనం, సురక్షితతంతో కూడిన పోస్టల్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి డివిజన్ పోస్టల్ సూపరెంటిండెంట్ సిహెచ్.శ్రీనివాసరావు, నర్సీపట్నం సౌత్ ఎస్‌ఒ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ దివాకర్ అన్నారు. బుధవారం జికె.వీధి పోస్టాఫీస్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పోస్టల్‌లో అనేక నూతన పథకాలు డిజిటల్ పద్ధతిలో ప్రజలకు అందిస్తున్నామన్నారు. ఉపాధి హామీ పథకం, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి ప్రభుత్వ పథకాలకు నిధులు చెల్లింపుతోపాటు ఆన్‌లైన్ ఖాతాల్లో పోస్టల్ పేమెంట్స్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటితోపాటు కేంద్ర ప్రభుత్వ బేటీబచావో, బేటీ పడావో ద్వారా పదేళ్ల లోపు ఆడపిల్లలకు పోస్టల్ పథకాలు, థర్డ్ పార్టీ కంపెనీలతో ప్రమాదబీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఏడాదికి రూ.555 ప్రీమియం చెల్లింపుతో రూ. పదిలక్షలు, రూ.750 ప్రీమియం చెల్లింపుతో రూ. 15 లక్షల ప్రమాదబీమా సౌకర్యం పొందవచ్చన్నారు. లాజిస్టిక్స్ ద్వారా అతి తక్కువ ఖర్చుతో రూ. 42తో ప్యాకేజీలు పార్సెల్ పంపుకోవచ్చన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తపాలాశాఖ ముందడుగు వేస్తోందన్నారు. ఈసందర్భంగా మండల పరిధిలోని ఎనిమిది బ్రాంచి పోస్టాఫీస్‌లు, బిపిఎం, ఎస్‌పిఎంలతో కలిసి 20మంది సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌పిఎంలు అనిత, శ్రీను, పెదవలస బిపిఎం జగదీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోస్టల్ అధికారులు శ్రీనివాసరావు, దివాకర్

చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-విఆర్ పురం : మండలంలోని ప్రధాన రహదారి కూడలిలో చాకలి ఐలమ్మ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు కొక్కెరపాటి రవీంద్ర, తాళ్లూరి బుజ్జయ్య, శ్రీనివాసరావు, ఇతర నాయకులతో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్మరణీయ స్థానాన్ని సంపాదించిన గొప్ప ఉద్యమకారిణి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. పేదల కుటుంబానికి చెందిన ఐలమ్మ, న్యాయం కోసం, భూస్వాముల అన్యాయానికి దొరలకు ఎదురొడ్డి వీరోచిత పోరాటం చేశారని కొనియాడారు. తెలంగాణ ప్రజలకు రైతాంగానికి ధైర్యం నూరిపోసిన వీర మహిళగా చరిత్రలో నిలిచారన్నారు. నేడు పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల న్యాయమైన హక్కుల సాధనకు ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఐలమ్మ చూపిన త్యాగం ధైర్యం నేటితరానికి స్ఫూర్తిదాయకం కావాలన్నారు. మహిళల శక్తి ఏ స్థాయిలో మార్పు తీసుకురాగలదో ఆమె చూపిన మార్గమే నేటితరానికి మార్గదర్శకమన్నారు..సిపిఎం పట్టణ కార్యదర్శి కొండా ఈశ్వర్లు, పార్టీ మండల కమిటీ సభ్యులు తాళ్ళూరు శ్రీను,నాయకులు తెలగని నాగరాజు, గడ్డిపాటి షణ్ముఖరావు, ప్రగిల్లా లక్ష్మణబాబు నోముల సత్యనారాయణ, తాళ్లూరి రామారావు, తాళ్ళూరు నీల తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మకు నివాళులర్పిస్తున్న రవీంద్ర, తదితరులు



సత్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

ఉత్తమ ఉపాధ్యాయులకు యుటిఎఫ్ సన్మానం

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న జాకర వలస గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పి ధర్మ, సాగర మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు జాకర రాజ్ కుమార్‌లను యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు యస్ బాలకృష్ణ అధ్యక్షతన బుధవారం సన్మానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.కన్నయ్య మాట్లాడుతూ, మండలంలో నుంచి ఇద్దరు ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు రావడం ఆనందదాయకమన్నారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కే రఘునాథ్ మాట్లాడుతూ,ఉత్తమ అవార్డు ఉపాధ్యాయులు ఇంకెంతో ఆదర్శమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె రాజారావు, సీనియర్ యుటిఎఫ్ నాయకులు టి సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు ఎం సత్యనారాయణ, ఎం.మోహన్, మేఘనాథ్, కే గెన్ను, జి.దుక్కు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-చింతపల్లి : గిరిజన గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జనసేన మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు అన్నారు. మండలంలోని తమ్మంగుల పంచాయతీ సెక్రటరీ కిరణ్ ఆధ్వర్యంలో గ్రామంలో బుధవారం ఆది కర్మయోగి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్ళు గడిచినా మన్యప్రాంతం అభివృద్ధి పరంగా వెనకబడి ఉందని చెప్పారు. గత ప్రభుత్వాలు పంచాయతీల అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం వహించాయని ఆరోపించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సరివిల్లి లక్ష్మయ్య, వైస్ ప్రెసిడెంట్ మల్లేశ్వరరావు, జనసేన సీనియర్ నాయకుడు మర్రి మనోహర్, టీడీపీ యూనిట్ ఇన్‌ఛార్జ్ వంతల భీమన్న, సచివాలయ సిబ్బంది, డిజిటల్ అసిస్టెంట్ పాంగి శ్రీను, వివిధ శాఖల అధికారులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


నివేదిక ఇస్తున్న పశువైద్యాధికారి

మూగజీవుల మృతిపై నివేదిక

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని తుఫాను ప్రభావం కారణంగా మూగజీవుల మృత్యువాతపై స్థానిక తహశీల్దార్ వీరభద్రాచారి కాశీపట్నం పశువైద్య అధికారి సాగర్ గణేశ్వరరావు బుధవారం కలిసి నివేదిక అందజేశామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాశీపట్నం, అనంతగిరి పశువైద్య కేంద్రాల పరిధిలో ఉన్న 24 పంచాయతీ గ్రామాల్లో పశువులు, మేకలు పిడుగు పాటు గురై మృత్యువాతకు గురైనట్లు తమ దృష్టికి రైతులు తీసుకువచ్చారని తెలిపారు. ఈ పశు వైద్య శాఖ తరపు నుండి ప్రభుత్వానికి పూర్తి నివేదిక అందజేస్తామన్నారు.పశువు పెంపకదారులు మృత్యువాతకు గురైన విషయంపై సచివాలయం వెటర్నరీ సిబ్బంది లేదా నేరుగా తమ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చునని ఆయన తెలిపారు.

గిరిజనులకు తప్పని డోలీ మోతలు

ప్రజాశక్తి-అనంతగిరి: అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడును కుటుంబ సభ్యులు డోలి సహాయంతో ఉప్పొంగి ప్రవహిస్తున్న గెడ్డ మీదుగా వైద్యం కోసం తరలించిన ఘటన మండలంలోని లుంగపర్తి పంచాయతీ పరిధి నేలపాలెంలో నెలకొంది. గ్రామానికి చెందిన సిరగం ఎండన్నను ఐదు కిలోమీటర్ల మేర డోలీ సహాయంతో లుంగపర్తి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తరలించారని సిపిఎం మండల కమిటీ సభ్యులు జె. భీమన్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత వారం రోజులుగా ఎండన్న ఆరోగ్య పరిస్థితి బాగోలేదని, పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు బుధవారం వైద్యం కోసం డోలి సహాయంతో తరలించడం జరిగిందని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం అడవి తల్లిబాటతో మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు సదుపాయాలు కల్పిస్తున్నట్లు ప్రకటనలకే పరిమితమైంది తప్ప ఇప్పటివరకు రోడ్డు సౌకర్యాలు కల్పించిన దాఖలాలు లేవన్నారు. నేలపాలెం, ఎర్రమెట్టు, వంతెనగరువు, బుర్రగుడ, చట్టువలస గ్రామాల గిరిజనులకు సరైన రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా శాశ్వత రోడ్డు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

గెడ్డ మీదుగా డోలీ తరలింపు


తరలిస్తున్న కుటుంబ సభ్యులు

ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు


రోగితో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్ఒ

ప్రజాశక్తి-అనంతగిరి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆరుకు వేలి మండలం సుంకరమెట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలను అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విశ్వేశ్వర నాయుడు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు జరిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అత్యవసర వైద్యం అందించుటకు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. పి. హెచ్. సిల పరిధిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల రికార్డులను పరిశీలించారు. పి.హెచ్.సిలలో సుఖప్రసవాల గురించి వైద్యాధికారికి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రులలో నమోదయిన మలేరియా కేసులు, అందిస్తున్న చికిత్సల గురించి వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ఎపిడమిక్ సీజన్లో వైద్య సిబ్బంది గ్రామస్థాయిలో సందర్శించి సకాలంలో రోగులను వైద్య సేవలు అందించాలన్నారు.ఆసుపత్రులలో ఉన్న మందుల నిలువలను, అన్ని వార్డులను తనిఖీ చేశారు. అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాల్సిందిగా వైద్యాధికారులకు ఆదేశించడం జరిగింది. ఈ కార్యాక్రమంలో అల్లూరి జిల్లా వ్యాధి నిరోధక కార్యక్రమం అధికారిణి కే కమల కుమారి, పి..హెచ్.సి వైద్యాధికారులు, జిల్లా కార్యాలయ ఆరోగ్య విస్తరణ అధికారులు యం.సంజీవ్ పాత్రుడు పాల్గొన్నారు.

పాడేరులో ఫుడ్ కమిషన్ సభ్యుడు పర్యటన

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి. కాంతారావు బుధవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో పర్యటించారు. ముందుగా ఎంకె వీధిలోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. చిన్నారులతో ముచ్చటించారు. రికార్డ్స్ సక్రమంగా లేక పోవడాన్ని గుర్తించి తగు చర్యలు నిమిత్తం మెమో జారీ చేయాలని ఆదేశించారు. తదనంతరం పాత పాడేరు గవర్నమెంట్ ఎలిమెంటరీ స్కూల్ తనిఖీ చేసి అటెండెన్స్ రిజిస్టర్‌లో తప్పులు ఉండడంతో స్కూల్ హెచ్ఎంకు మెమో ఇవ్వాలని డిఇఒను ఆదేశించారు. పాడేరులో మండల స్థాయి స్టాక్ పాయింట్ తనిఖీ చేసి ఆహార ధాన్యాలు నిల్వ, స్టాక్ పై ఆరా తీశారు. రికార్డులు, అన్ని సక్రమంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. సుండ్రుపుట్టులో ఫ్యాషన్ డిపో తనిఖీ చేసి నిల్వ ఉన్న ఆహార ధాన్యాల వివరాలు, వేయింగ్ మిషన్ లైసెన్స్ పరిశీలించి రేషన్ లబ్ధిదారులకు ఆహార ధాన్యాలు సక్రమంగా అందేలా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిఎస్ఒ మోహన్, సిఎస్ డిటి ప్రశాంత్, ఐసిడిఎస్ పిడి ఝాన్సీ, డిఇఒ బ్రహ్మాజీ, ఫుడ్ సేఫ్టీ అధికారి గ్రీష్మ, లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ అనురాధ, ఎంఇఒ సరస్వతి దేవి, లైజనింగ్ ఆఫీసర్ జాక తేజ, తదితరులు పాల్గొన్నారు.


రిజిస్టర్ పరిశీలిస్తున్న కాంతారావు

నేరాలు ఘోరాలు

రెండు బైకులు ఢీ
- ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని కొంతీలి కోలని సమీపంలో బుధవారం సాయంత్రం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. బైక్‌పై పాతకోట పంచాయతీ పాలెం గ్రామానికి చెందిన కొర్రా నర్సింగ్‌రావు, శాంతి దంపతుల వెళుతున్నారు. వెనుక నుంచి వస్తున్న తడిగిరి గ్రామానికి చెందిన సుబ్బారావు, గిరిబాబు వస్తున్న బైక్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో సుబ్బారావు, గిరిబాబు, కొర్రా శాంతి గాయపడ్డారు. వీరికి హుకుంపేట ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి, పరిస్థితి విషమంగా ఉండడంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు హాస్పిటల్‌కు చేరుకొని ఘటనపై వివరాలు సేకరిస్తున్నారు.


ప్రతిభ చాటిన విద్యార్థులు

క్రీడా పోటీల్లో ఏకలవ్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-చింతపల్లి : గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ స్పోర్ట్స్ మీట్-2025లో చింతపల్లి ఏకలవ్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. 100 మీటర్ల పరుగులో మహేష్ స్వర్ణం, బోయ మహేంద్ర రజతం, జావెలిన్ త్రోలో బి.మహేంద్ర రజతం, జానీబాబు కాంస్యం సాధించారు. 400 మీటర్ల రిలేలో రవిబాబు, మహేంద్ర, ప్రవీణ్, స్టీఫెన్ల బృందం ద్వితీయ బహుమతి పొందింది. వచ్చే నెల ఒరిస్సాలో జరగనున్న ఏకలవ్య నేషనల్ మీట్లో కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, ఖోఖో విభాగాల్లో కూడా పాఠశాల విద్యార్థులు పాల్గొననున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పి.మనోజ్‌కుమార్ తెలిపారు. విద్యార్థుల విజయానికి పిఇటి అరుణ్‌కుమార్ సింగ్ శిక్షణ ప్రధాన కారణమని, జాతీయస్థాయికి ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు.

సమస్యలపై అధికారులకు వినతి

ప్రజాశక్తి జికె..వీధి : సమస్యల పరిష్కారంలో అధికారులు సహకరించాలని టిడిపి నేతలు కోరారు. బుధవారం ఎంపిడిఒ, ఎస్ఐ, ఎపిఒ, ఇతర అధికారులను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సన్మానించారు. సమస్యలను విన్నవించారు. ప్రధానంగా నిమ్మలపాలెం గ్రామానికి అనుకొని ఉన్న నేషనల్ హైవే 516 డైవర్షన్ రోడ్ వెడల్పు చేయించాలని, తద్వారా ప్రమాదాలు నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఎస్ఐని కోరారు. అధికారులను కలిసిన వారిలో మండల టిడిపి అధ్యక్షులు పొత్తూరు కొండలరావు, పిఎసిఎస్ చైర్మన్ మొట్టడంనూకరాజు, సంకాడ గ్రామకమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు, తెలుగు యువత అధ్యక్షులు ముర్ల కోటేశ్వరరావు, ఆర్గనైజేషన్ కార్యదర్శి ఎంవివి. ఎస్ ప్రసాద్, మామిడి నాగేంద్ర, మొట్టడం రామకృష్ణ, బేర సత్యనారాయణ పడాల్, పీసా ఉపాధ్యక్షులు మొట్టడం వెంకటరమణ, మొట్టడం రాంబాబు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి- కొయ్యూరు : మండలంలోని రేవడివీధి, కొప్పుకొండ గ్రామాల మధ్యలో ఉన్న వాగుపై కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. వర్షాలకు వాగుపై ఉన్న కల్వర్టు పూర్తిగా కొట్టుకుపోయిందని,. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కొప్పుకొండలో పాఠశాల లేక, బడి ఈడు పిల్లలు రేవడివీధి పాఠశాలకు వెళుతున్నారన్నారు.కల్వర్టు కొట్టుకుపోవడంతో బడికి వెళ్లే పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

రైతులకు యూరియా పంపిణీ


యూరియా పంపిణీ చేస్తున్న సర్పంచ్ సరోజిని, విజయలక్ష్మి

ప్రజాశక్తి- విఆర్.పురం: ఆలస్యంగానైనా అందుబాటులోకి వచ్చిన యూరియా, ఇతర ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని రేఖపల్లి సర్పంచ్ పూనం సరోజిని అన్నారు. బుధవారం రేఖపల్లిలో గ్రామపంచాయతీ పరిధిలోని రేఖపల్లి, అన్నవరం, ఉమ్మడివరం గ్రామాల రైతులకు ఎరువులను బంధం విజయలక్ష్మితో కలిసి పంపిణీ చేశారు. వారం రోజుల్లో మరో 40టన్నుల యూరియా రానుందని, రైతులు ఆందోళన చెందకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరి రైతులకు ఐటిడిఎ ద్వారా వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేయాలని కోరారు.

తాత్కాలిక రహదారి ఏర్పాటు చేయాలి

అన్నవరం, ఉమ్మడివరం మధ్యలో కాజ్‌వే కూలిపోవడంతో రేఖపల్లి నుంచి ఉమ్మడివరానికి ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పనిముట్లను తీసుకెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ పూనం సరోజిని ఆవేదన వ్యక్తం చేశారు. కొట్టుకుపోయిన కాజ్‌వే వద్ద వాగులో దిగి మోసుకెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే కాజ్‌వే కొట్టుకుపోగా, నెలరోజులైనా అతీగతీ లేదని, ప్రత్యామ్నాయంగా తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేసి రాకపోకలు పునరుద్ధరించే చర్యలు అధికారులు చేపట్టకపోవడం సరికాదన్నారు. సిపిఎం మండల కార్యదర్శి పులి. సంతోష్‌కుమార్, మండల నాయకులు పోడియం. శ్రీరామ్మూర్తి, నాయకులు పూనం. కిరణ్, టిడిపి నాయకులు బుర్క. కన్నారావు, బుర్ర నరసింహారావు, పాయం రామారావు, శేఖర్, పాల్గొన్నారు.

సరిపడా ఎరువు పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి -సీలేరు: మండలంలోని రైతులకు సరిపడా యూరియా పంపిణీకి అన్ని చర్యలు చేపడుతున్నట్లు, గిరి రైతులు ఆందోళన చెందవద్దని జికె. వీధి మండల వ్యవసాయాధికారి గిరిబాబు వెల్లడించారు. బుధవారం సీలేరు రైతు సేవా కేంద్రంలో మాట్లాడుతూ మండలానికి 12 టన్నుల యూరియా రాగా, మండల కేంద్ర పరిధిలో నాలుగు టన్నులు రైతులకు పంపిణీ చేశామన్నారు. మిగిలిన 8 టన్నులు మంగళవారం దారకొండ రైతుసేవా కేంద్రానికి తరలించి పంపిణీకి సిద్ధంకాగా, గుమ్మరేవులు, దుప్పిలివాడ ధారకొండ పంచాయతీల రైతులు భారీగా రావడంతో గందరగోళం నెలకొని పంపిణీ నిలిపేశామన్నారు. యూరియా కొరత సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా, ద్వారంపూడి నుంచి మండలానికి కేటాయించిన 20 టన్నులు గురువారం రానుందని, రింతాడలో ఐదు టన్నులు, దారకొండలో మూడు టన్నులు, గుమ్మరేవుల, దుప్పాడ రైతు సేవా కేంద్రాల్లో చెరో ఆరేసి టన్నులు ఉంచి రైతులకు పంపిణీ చేస్తామన్నారు.కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి పాల్గొన్నారు.అలాగే దారకొండ రైతు సేవా కేంద్రంలో బుధవారం సర్పంచ్ రాజు అధ్యక్షతన రైతులతో ఎఒ గిరిబాబు సమావేశమయ్యారు. యూరియా లభ్యత, సరఫరాపై వివరించారు. కార్యక్రమంలో మాడి రామన్న పాల్గొన్నారు.

వైసిపి మొసలి కన్నీరు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రైతు సమస్యలు, యూరియా కొరత పేరుతో వైసిపి తప్పుడు ప్రచారం చేస్తూ, నాటకాలాడుతూ మొసలి కన్నీరు కారుస్తోందని ఎమ్మెల్యే శిరీషాదేవి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ మండిపడ్డారు. బుధవారం రాజవొమ్మంగిలో విలేకర్లతో మాట్లాడుతూ, ఐదేళ్ల పాలనలో ఏనాడూ అన్నదాతల గురించి ఆలోచించని వైసిపి నేతలు, ఇపుడు యూరియా కొరత పేరుతో రోడ్డెక్కి అలజడి చేస్తున్నారన్నారు. యూరియా లభ్యత, సరఫరాపై రైతులు, ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. రాజవొమ్మంగిలో రైతు సేవా కేంద్రాలు, ప్రయివేటు వ్యాపారుల వద్ద యూరియా ఉందని, రేపు, ఎల్లుండి యూరియా నిల్వలు రానున్నాయన్నారు. వైసిపి పాలనలో గిట్టుబాటు ధర కోసం రోడ్డెక్కిన రైతులను ఇష్టానుసారంగా అరెస్ట్‌చేసిన ఉదంతాలు ఆ పార్టీ నేతలు మరిచిపోయినా, ప్రజలు మరిచిపోలేదన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గణజాల తాతారావు, జనసేన అధ్యక్షుడు బొదిరెడ్డి తెమూర్తులు, వాసంశెట్టి గంగాధర్, కంఠపురెడ్డి వీరబాబు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ


కూనవరంలో స్మార్ట్ కార్డుల పంపిణీలో సర్పంచ్, ఎంపిటిసి

ప్రజాశక్తి -చింతూరు : రేషన్ పంపిణీలో పారదర్శకత, సమర్థవంతంగా నిర్వహణకు కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల విధానాన్ని తీసుకొచ్చిందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని చింతూరు మండల టిడిపి అధ్యక్షులు మహ్మద్ జమాల్ ఖాన్ అన్నారు. బుధవారం చింతూరు సచివాలయంలో తహసిల్దార్ సయ్యద్ హుస్సేన్, చింతూరు సర్పంచ్ కారం కన్నారావు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. చింతూరు డిపోకు 1146 స్మార్ట్ కార్డులు వచ్చాయన్నారు. కూటమి నాయకులు మాట్లాడుతూ రేషన్ బియ్యం దుర్వినియోగాన్ని అరికట్టే లక్ష్యంతో ప్రభుత్వం సాంకేతికతను వినియోగించి స్మార్ట్ కార్డులు రూపొందించిందన్నారు.. ప్రతి కార్డులో క్యూఆర్ కోడ్‌తో రేషన్ పంపిణీ సమాచారం ఉన్నతస్థాయికి చేరుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిపి ఆమల, వైస్ ఎంపిపి చిన్ని, మాజీ మండలాధ్యక్షుడు ఎండి జహంగీర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుడు పి. సాల్మన్ రాజు, మహిళ నాయకురాలు మంగవేణి, తెలుగుదేశం నాయకులు చిన్నారెడ్డి, ఆసిఫ్, రామారావు, ఓ నరసింహారావు, సురేష్ చౌదరి, కూటమి నాయకులు బంగారు లక్ష్మణ్, మడివి రాజు, కాంగ్రెస్ నాయకులు అహమ్మద్ అలీ, ఎండి హబీబ్, సిపిఎం నాయకులు పల్లపు వెంకట్, విఆర్ఒ రామచంద్రరావు, కార్యదర్శి జగన్ పాల్గొన్నారు.

సీలేరు: గూడెం కొత్తవీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ బుషికొండ, వలసగెడ్డ, వలసగెడ్డ కొత్తూరులో బుధవారం దుప్పులవాడ సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ సమక్షంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. జనసేన ఇన్‌ఛార్జి జె.బాలకృష్ణ, కూటమి నాయకులు మండి బొజ్జ, కొర్ర భాస్కరరావు రేషన్ డిపో డీలర్ శేఖర్ పాల్గొన్నారు.

కూనవరం: మండలంలోని పెద్ద ఆర్కూర్ సచివాలయం వద్ద బుధవారం స్థానిక సర్పంచ్ నాగమణి ఎంపిటిసి అమ్మాజీ చేతుల మీదుగా విఆర్ఒ పైదా రాజారావు ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులు, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.

అడ్డతీగల : ఎల్లవరం పంచాయతీ సచివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి మురళీమోహన్, విఆర్ఒ రమణ ఆధ్వర్యంలో 870 స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి కాంతం , సర్పంచ్ నూగారత్నం, డిఆర్ డిపో సేల్స్‌మాన్ లక్ష్మీ గణపతి పాల్గొన్నారు

రాజవొమ్మంగి: మండలంలో జడ్డంగి గ్రామంలో బుధవారం గామ సర్పంచ్ కొంగర మురళీకృష్ణ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. సొసైటీ మాజీ అధ్యక్షులు టిడిపి నాయకులు గణజాల తాతారావు, మాజీ సర్పంచ్ కోపూరి రత్నం, నాయకులు వాసంశెట్టి గంగాధర్, చెక్కా పంసుబాబు, బారంగి అనుదీప్, ఎలిశెట్టి అప్పలరాజు, గణజాల మల్లిఖార్జున, పంది చిన్నబ్బాయి, జడ్డంగి గ్రామటిడిపి అధ్యక్షుడు కంఠపురెడ్డి వీరబాబు, ప్రధాన కార్యదర్శి తెడ్ల రాంబాబు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

జికె వీధి : మండలంలోని జర్రెల పంచాయతీ లోబ్బగుంట, కొండకించంగి గ్రామాల్లోని లబ్ధిదారులకు బుధవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. జనసేన మండల ప్రధాన కార్యదర్శి పొత్తూరు విష్ణుమూర్తి, టిడిపి పంచాయతీ అధ్యక్షులు ముర్ల సంతోష్, బీరంగి రాజుబాబు, బాబూరావు, రీమల బుజ్జిబాబు, సాగిన అనిల్ సీనియర్ నాయకులు అడప విష్ణుమూర్తి, వార్డుమెంబర్ తోట వెంకటరమణ, విఆర్ఒ వెంకటేశ్వర్లు, సర్వేయర్ కాసులమ్మ, డిజిటల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌పై వైసిపి, టిడిపి వాగ్వాదం


చింతూరులో వాదులాడుకుంటున్న వైసిపి టిడిపి నేతలు

చింతూరు : మండలం కేంద్రంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో వేదికపైకి ఎంపిపి అమల, వైస్ ఎంపిపి చిన్నిలను ఆహ్వానించకుండా అవమానించారని వైసిపి నేతలు మండిపడ్డారు. తహశీల్దార్ సయ్యద్ హుస్సేన్‌తో వాగ్వివాదానికి దిగారు. ప్రజాప్రతినిధులను పిలిచి, వారు సభకు వచ్చిన తర్వాత ప్రోటోకాల్ ప్రకారం వేదికపైకి ఆహ్వానించాల్సిన బాధ్యత అధికారులదేనని, దాన్ని ఉల్లంఘించడం సరికాదని మండిపడ్డారు. కనీసం కూర్చొనేందుకు కుర్చీ వేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. దీనిపై టిడిపి నేతలు జోక్యం చేసుకుని, ప్రోటోకాల్ ప్రకారం స్థానిక సర్పంచు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగిందని, స్థలాభావంతోపాటు, బయట వర్షం కారణంగా వేదికపై అందరూ కూర్చొనే వీలులేకపోవడంతో కొందరినే వేదికపైకి పిలిచారన్నారు. టిడిపి, వైసిపి నేతల వాగ్వాదంతో కొందసేపు వాగ్వాదం చోటుచేసుకుంది, తహశీల్దార్, సచివాలయసిబ్బంది కలుగజేసుకుని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకుంటామని చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

భూఉద్యమం జోలికొస్తే ఊరుకోం

ప్రజాశక్తి- ఎటపాక : ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న భూపోరాటం జోలికొస్తే ఊరుకునే ప్రసక్తే లేదని సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కాక అర్జున్ దొర హెచ్చరించారు. సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘంపై లేని పోనీ ఆరోపణలు చేస్తూ, స్వలాభం కోసం భూస్వాములకు పాయం వెంకయ్య వ్యవహరిస్తున్న తీరుపై మండిపడ్డారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా రాజకీయాలకతీతంగా ఉద్యమాన్ని నిర్వహిస్తుంటే, గిరిజనేతర పేదల భూములలో ఎర్రజెండాలు పాతారని తప్పుడు ప్రచారం చేస్తున్న వెంకయ్య తీరుపై మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు పేరుతో ఉన్న ప్రభుత్వ భూములు భూస్వాములకు ఎలా చెందుతాయో చెప్పాలన్నారు. పోడు భూముల పేరుతో భూఆక్రమణకు పాల్పడి తోటి గిరిజనులకు అన్యాయం చేయలేదా అని వెంకయ్యను ప్రశ్నించారు. షెడ్యూల్ ప్రాంతంలో ప్రభుత్వ భూములను అనుభవించే హక్కు గిరిజనులకు ఉంటుందన్నారు. ఏటా వరదలకు మురుమూరు, నందిగామ, రాఘవపురం గ్రామాలు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ఏనాడూ స్పందించని వ్యక్తి, ఇపుడు గిరిజనేతరులు, గిరిజనుల మధ్య చిచ్చుపెట్టే కుట్రలను మానుకోవాలని హితవు పలికారు.

ధారకొండను మండల కేంద్రం చేయాలి



ఎఎస్‌పికి వినతిపత్రం అందజేసిన మండల సాధన కమిటీ నాయకులు

ప్రజాశక్తి -సీలేరు: ధారకొండ మండల కేంద్రం అయితేనే ఈ ప్రాంత సమస్యలు పరిష్కారమై, అభివృద్ధికి ఆస్కారముంటుందని ధారకొండ మండల సాధన కమిటీ నాయకులు సంకర విష్ణుమూర్తి అల్లంకి రాజు అన్నారు. బుధవారం చింతపల్లి ఎఎస్‌పి నవ జ్యోతి మిశ్రాను కలిసి, మండల కేంద్రంగా ధారకొండ ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎఎస్‌పి స్పందిస్తూ, ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం సాధన కమిటీ నేతలు మాట్లాడుతూ, ధారకొండ ప్రాంతం నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రం జికె.వీధి వెళ్లాలంటూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. రహదారి నిర్మాణంపై జిల్లాకలెక్టర్, ఇతర అధికారులకు గుమ్మిరేవులు, దారకొండ, సీలేరు, గాలికొండ, ఎ.దారకొండ తదితర ఆరు పంచాయతీల ప్రజలు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా స్పందన లేదని విచారం వ్యక్తం చేశారు. ఎఎస్‌పి సానుకూలంగా స్పందించడంపై ఆనందం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులను నియమించాలని నిరసన

ప్రజాశక్తి -సీలేరు: జికె.వీధి మండలం గుమ్మరేవుల పంచాయితీ దారకొండ స్కూల్ కాంప్లెక్స్ పరిధి నేలజర్త మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని తల్లిదండ్రులు నిరసన చేపట్టారు. దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్పురాజు ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయుల కొరతపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఒకటి నుంచి అయిదు తరగతులకు 104 మంది విద్యార్థులున్నాయని, ఒక్క భాషా వాలంటీరుతో వీరికి అన్నిసబ్జెక్టుల విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, ఇతర కార్యకలాపాల నిర్వహణ ఎలా సాధ్యమో మండల విద్యాశాఖాధికారులే చెప్పాలన్నారు. . ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటివరకు ఒక్క ఉపాధ్యాయిని నియమించలేదని, ఉపాధ్యాయుల నియామకంపై పలుమార్లు విన్నవించినా, ఎంఇఒలు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలో 16 పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేరని, దీంతో విద్యార్థులు విద్యకు దూరమై పశువులు కాపరులుగా మారిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి ఉపాధ్యాయులు నియమించకపోతే విద్యార్థులు తల్లిదండ్రులతో పాడేరు వెళ్లి కలెక్టర్ ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

కూటమి వైఫల్యాలపై ప్రజా పోరాటం

ప్రజాశక్తి -మారేడుమిల్లి: మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు వివరించి చెప్పాలని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీపై మారేడుమిల్లిలో మండల స్థాయి పార్టీ కేడర్ సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ప్రజలను మోసం చేసిందని, దీనిపై ప్రజలు గొంతుకై వైసిపి పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల వద్దకు పాలనతో జగన్మోహన్ రెడ్డి నూతన సంస్కరణలు తీసుకొస్తే, చంద్రబాబు నాయుడు వాటిని ధ్వంసం చేసేందుకు వ్యూహరచన చేస్తున్నారన్నారు. మారేడుమిల్లి మండల పార్టీ అధ్యక్షులు సత్తి సత్యనారాయణ రెడ్డి, ఎంపిపి లలిత కుమారి, వైస్ ఎంపిపి రవికుమార్, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు గంగరాజు, సర్పంచులు, కో ఆప్షన్ సభ్యులు గురుకు ధర్మరాజు పాల్గొన్నారు...

ఎఒగా రాజ్‌కుమార్

ప్రజాశక్తి -కొయ్యూరు : కొయ్యూరు మండల వ్యవసాయ అధికారిగా బి.రాజ్‌కుమార్ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఎఒగా పనిచేసిన ఐ.భాను ప్రియాంక పాడేరులోని జిల్లా వ్యవసాయ కార్యాలయంలో టెక్నికల్ విభాగంలో వ్యవసాయ అధికారిగా డిప్యుటేషన్‌పై వెళ్తున్నారు. అక్కడ టెక్నికల్ విభాగంలో ఎఒగా పనిచేస్తున్న బి.రాజ్ కుమార్ను కొయ్యూరులో నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.